
సాక్షి
ఖమ్మం
గురువారం । 25 । జూలై । 2024



బుధవారం.. పాఠశాల భోజనం

పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన భోజనం అందేలా అధికారులు ప్రతీ బుధవారం తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 8లో



37,625 మందికి రుణమాఫీ

డీసీసీబీ పరిధిలో 37,625 మంది రైతులకు రూ.121కోట్లకు పైగా రుణమాఫీ జరుగుతోందని చైర్మన్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
31° / 25°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం రోజంతా చిరు జల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

కేఎంసీ కమిషనర్‌తో నేడు 'సాక్షి' ఫోన్ ఇన్



అభిషేక్ అగస్త్య, కమిషనర్



ఖమ్మం మయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, విషజ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు ప్రజలు తమ సమస్యలను వివరించేలా 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. ఈసందర్భంగా కేఎంసీ పరిధిలోని ప్రజలు సీజనల్ వ్యాధుల నేపథ్యాన తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకోవడంతో పాటు ఓపెన్ ప్లాట్లలో చెత్తనిల్వలు, డ్రెయినేజీలు, రోడ్లు సరిగ్గా లేకపోవడం తదితర సమస్యలను కమిషనర్ అభిషేక్ అగస్త్య దృష్టికి తీసుకురావొచ్చు.

తేదీ :
25-07-2024, గురువారం (నేడు)
సమయం : ఉదయం 10-30 నుంచి 11-30 గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్
79012 98265

ప్రక్షాళన దిశగా...

సుదీర్ఘకాలం తర్వాత స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో భారీ స్థాయిలో బదిలీలకు తెరలేచింది. ఇప్పటికే శాఖలోని జూనియర్, సీనియర్ అసిస్టెంట్లను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రక్షాళనకు ఆదేశించినట్లు తెలిసింది. ఈ నేపథ్యాన రెండు, మూడు రోజుల్లో ఉమ్మడి జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లకూ స్థానచలనం తప్పదని సమాచారం.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖపై మంత్రి పొంగులేటి ఫోకస్

- రెండేళ్లు సర్వీస్ పూర్తయిన ఉద్యోగుల బదిలీ పూర్తి
- జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లకూ నేడో, రేపో స్థానచలనం
- 'జీరో సర్వీస్' ఆధారంగా అందరికీ ట్రాన్స్‌ఫర్ తప్పదని చర్చ



కీలకశాఖ కావడంతో..

ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కీలకం. అయితే ఇటీవల కొన్నిచోట్ల ప్రభుత్వ స్థలాలను రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. చాలా ప్రాంతాల్లో భూవివాదాలు నెలకొంటున్నాయి. కొన్ని జిల్లాల్లో శాఖ అధికారులు, సిబ్బంది పనితీరుపై విమర్శలు ఉండగా.. సాధారణ బదిలీలు జరుగుతుండడంతో రాష్ట్రవ్యాప్తంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేపట్టాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భావించినట్లు తెలుస్తోంది. ఈమేరకు ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇవ్వగా చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఇదేక్రమాన ఉమ్మడి ఖమ్మం జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి.. బదిలీలపై సూచనలు చేసినట్లు తెలిసింది.

సబ్ రిజిస్ట్రార్లకు కూడా..

ఇతర ఉద్యోగులతో పాటు సబ్ రిజిస్ట్రార్లకు కూడా స్థానచలనం కలగనుంది. ఉమ్మడి జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఒక్కొక్కరు చొప్పున మార్కెట్ వాల్యూ ఆడిట్‌లో ఇద్దరు, చిట్స్ రిజిస్ట్రార్‌లో ఒకరు, రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒకరు కలిపి 15మంది విధులు నిర్వర్తించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం జిల్లాలో 11 మంది సబ్‌రిజిస్ట్రార్లే పనిచేస్తున్నారు. ఫలితంగా కొన్ని కార్యాలయాలు ఇన్‌చార్జిలతోనే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్లకు రెండు, మూడు రోజుల్లో బదిలీలు జరిగే అవకాశం ఉండగా.. ఇప్పటికే సమాచారాన్ని ఉన్నతాధికారులు తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే జిల్లా రిజిస్ట్రార్ కూడా బదిలీ అయ్యే అవకాశముందని సమాచారం.

సమూలంగా మార్పు

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో రెండేళ్లకు మించి ఒకే చోట పనిచేస్తున్న వారందరికీ బదిలీ తప్పదనే చర్చ సాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ అంశంపై మంత్రి పొంగులేటి దృష్టి సారించడంతో సాధారణ బదిలీలతో పాటే మిగతా వారికీ స్థానచలనం కలుగుతోందని సమాచారం. జిల్లాలో ఆరుగురు సబ్ రిజిస్ట్రార్లు రెండేళ్లకు మించి పనిచేస్తున్నారు. అయితే జీరో సర్వీస్ లెక్కన బదిలీలు జరుగుతాయని, ఫలితంగా సబ్ రిజిస్ట్రార్లు అందరికీ ట్రాన్స్‌ఫర్ తప్పదని చెబుతున్నారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలతో 40 శాతం ఉద్యోగులను బదిలీ చేయాల్సి ఉండగా.. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో జీరో సర్వీస్ ప్రాతిపదికన అందరినీ బదిలీ చేసి జిల్లాల్లో కొత్త వారిని నియమించనున్నట్లు తెలుస్తోంది. ఈవిషయమై అధికారులను ఆరా తీయగా తమకు వచ్చిన ఆదేశాల మేరకు రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న సబ్ రిజిస్ట్రార్ల వివరాలను ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు.

ఇప్పటికే కొందరి ట్రాన్స్‌ఫర్

ఉమ్మడి జిల్లాకు సంబంధించి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో జూనియర్, సీనియర్ అసిస్టెంట్లతోపాటు అటెండర్ల బదిలీలు పూర్తయ్యాయి. వీరంతా 2017 నుంచి అంటే దాదాపు ఏడేళ్లుగా ఆయా స్థానాల్లో పనిచేస్తున్నారు. ఇక కొందరు 13 ఏళ్లుగా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, ఓ షరాఫ్(క్యాషియర్) అకౌంటెంట్ మాత్రం కల్లూరు నుంచి ఖమ్మం ఆర్‌ఓకు బదిలీ అయ్యారు. ఇక బదిలీ అయిన సీనియర్ అసిస్టెంట్లు రిలీవ్ కాగా.. ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఉద్యోగులు బుధవారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్లు మొత్తం 55 మందికి బదిలీ అయింది.

ఆగస్టు నెలాఖరులోగా పనులు పూర్తి



వీ.వీ.పాలెం విద్యార్థినులను అభినందిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఎంపిక చేసిన అమ్మ ఆదర్శ పాఠశాలల మిగులు పనులను ఆగస్టు నెలాఖరులోగా పూర్తిచేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన పనుల పురోగతిపై ఇంజనీరింగ్ శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 955 పాఠశాలలకు గాను 508 పాఠశాలల్లో పూర్తయినందున మిగతా వాటిని త్వరగా పూర్తిచేసేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ సన్యాసయ్య, డీఈఓ సోమశేఖరశర్మ, ఆర్ అండ్ బీ ఎస్ఈ హేమలత, వివిధ శాఖల అధికారులు సీహెచ్.వేణు, వెంకట్‌రెడ్డి, శ్రీరాం కోటినాయక్, కృష్ణలాల్, బి.రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా లబ్ధిదారుల ఎంపిక

మహిళా శక్తి కింద చేపట్టనున్న వివిధ కార్యక్రమాలకు లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా పూర్తిచేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో మహిళా శక్తి యూనిట్లపై జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ప్రాంతాల వారీగా డిమాండ్ ఉన్న యూనిట్లను ఎంపిక చేయాలని తెలిపారు. బ్యాంకు లింకేజ్ రుణాలతో పచ్చళ్ల తయారీ, కిరాణం, మొబైల్ టిఫిన్ స్టాళ్లు, టైలరింగ్, టీ స్టాల్, మెడికల్ షాపుల నిర్వహణపై దృష్టి సారించాలని చెప్పారు. డీఆర్డీవో సన్యాసయ్య, అదనపు డీఆర్డీఓ నూరోద్దీన్, డీపీఎంలు శ్రీనివాసరెడ్డి, రేవతి, దర్గయ్య, డి.శ్రీనివాస్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధనతో ముందుకెళ్లాలి

రఘునాథపాలెం: విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకునే దాన్ని సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మండలంలోని వి.వెంకటాయపాలెం జెడ్పీహెచ్ఎస్‌ను తనిఖీ చేసిన ఆయన వసతులపై ఆరా తీయడంతో పాటు మధ్యాహ్న భోజనం నాణ్యత, బోధన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ చదువుకున్న వారికి గౌరవం లభించడమే కాక ఉన్నత స్థాయికి చేరుస్తుందని తెలిపారు. అనంతరం ఫుట్‌బాల్ పోటీల్లో మూడో స్థానం పొందిన బాలికలను కలెక్టర్ అభినందించారు. ఆర్‌ఎంఓ రాజశేఖర్, హెచ్‌ఎం బి.శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు ఉన్నారు

న్యూస్‌రీల్

రహదారుల అభివృద్ధికి రూ.80కోట్లతో ప్రతిపాదనలు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని వివిధ గ్రామాల్లో లింక్ రోడ్ల అభివృద్ధి, మరికొన్ని చోట్ల తారురోడ్లుగా అప్‌గ్రేడ్ చేసేందుకు సుమారు రూ.80 కోట్ల నిధులు అవసరమని అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేరిన నేపథ్యాన వారం, పది రోజుల్లో ఉత్తర్వులు విడుదలయ్యే అవకాశముందని శాఖ ఇంజనీర్ ఒకరు తెలిపారు. ప్రస్తుతం ఉన్న మట్టి రోడ్లు, డొంకరోడ్ల అభివృద్ధికే కాక ఇంకొన్ని చోట్ల దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుకు కోసం ప్రతిపాదనలు సమర్పించినట్లు పేర్కొన్నారు. సీఆర్ఆర్(కనెక్టివిటీ రూరల్ లింక్) పథకం ద్వారా ఇందుకోసం నిధులు మంజూరు కానున్నాయి. మండలంలోని 32 రోడ్ల వివరాలే కాక రహదారులపై వాగులు, వర్రెలపై వంతెనలు, కల్వర్టుల నిర్మాణ అంశాలు కూడా ప్రతిపాదనల్లో పొందుపర్చినట్లు తెలిసింది.

అగ్నిమాపకశాఖ అధికారిగా కృష్ణకుమార్

ఖమ్మం ఏడీఎఫ్ఓ పోస్ట్ రద్దు

ఖమ్మంక్రైం: ఏళ్ల తర్వాత అగ్నిమాపకశాఖలో బదిలీలు జరిగాయి. సుమారు పదేళ్ల తర్వాత ప్రభుత్వం బదిలీలు నిర్వహించగా.. ఉమ్మడి ఖమ్మం జిల్లా అగ్నిమాపక శాఖాధికారిగా హైదరాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న కృష్ణకుమార్‌ను కేటాయిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ ఏళ్లుగా పనిచేస్తున్న జయప్రకాష్ కొద్దినెలల క్రితమే శిక్షణ నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లారు. అప్పటినుంచి జయకృష్ణ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ అగ్నిమాపకశాఖాధికారిగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు ఆయనను హైదరాబాద్‌కు బదిలీ చేసి పూర్తి స్థాయి అధికారిగా కృష్ణకుమార్‌ను నియమించారు.

ఏడీఎఫ్ఓ పోస్ట్ రద్దు

ఉమ్మడి జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి(ఏడీఎఫ్ఓ) పోస్టును రద్దు చేస్తున్నట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. దీంతో దాదాపు పదేళ్ల నుంచి ఏడీఎఫ్ఓగా విధులు నిర్వర్తిస్తున్న రేమండ్ బాబును జనగామ జిల్లా అగ్ని మాపక శాఖ కార్యాలయానికి బదిలీ చేశారు. అలాగే, ఖమ్మం డివిజన్ అగ్నిమాపక శాఖాధికారి రాజేశ్వరరావును వరంగల్‌కు బదిలీ చేసి ఆయన స్థానంలో హనుమకొండలో పనిచేస్తున్న నాగరాజును నియంచారు.

మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అనుమతులు

లేఔట్ అప్రూవల్ కమిటీ సమావేశంలో కేఎంసీ కమిషనర్ అభిషేక్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: టీఎస్ బీపాస్ విధానం ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా భవన నిర్మాణాలకు అనుమతులు జారీ చేస్తున్నట్లు ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య వెల్లడించారు. కేఎంసీ కార్యాలయంలో బుధవారం జిల్లా స్థాయి లే ఔట్ అప్రూవల్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేఎంసీ పరిధిలో మూడు, సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలో ఒకటి, సుడా పరిధిలో 17 లేఔట్ల ఆమోదం కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్న వాటిని ఆమోదించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ దరఖాస్తులను గడువులోగా సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి అంతా సవ్యంగా ఉంటే అనుమతులు ఇవ్వాలని తెలిపారు. ఆపై జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆమోదించనున్నట్లు చెప్పారు. కాగా, లేఔట్లలో గ్రీనరీ కోసం కేటాయించిన స్థలాన్ని స్వాధీనం చేసుకుని మొక్కలు నాటాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌డీసీ రాజేశ్వరి, కల్లూరు ఆర్డీఓ రాజేందర్, ఇరిగేషన్ ఈఈ అనన్య, అధికారులు వికాస్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

భవనాన్ని కూల్చివేయండి..

- శిథిలావస్థకు చేరడంతో తపాలా శాఖకు నోటీసులు
- కలెక్టర్‌ను కలిసి సమయం కోరిన అధికారులు



శిథిలమైన పోస్టాఫీస్ భవనంలోని ఓ భాగం

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా కేంద్రంలో శిథిలమైన ప్రధాన తపాలా కార్యాలయం భవనాన్ని కూల్చివేయాలని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య నోటీసులు జారీ చేశారు. కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యాన జనావాసాల్లో ప్రమాదకరంగా మారిన భవనాల కూల్చివేతకు అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా శిథిలమైన తపాలా కార్యాలయ భవనాన్ని ఈనెల 26లోగా కూల్చివేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. దీంతో అధికారులు ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌కు సమాచారం ఇవ్వడంతో బుధవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కలిసి కూల్చివేతకు పది రోజుల గడువు కోరారు. దీంతో కలెక్టర్ ఆరా తీయగా భవనం పూర్తి శిథిలం కావడంతో పాటు జనావాసాల నడుమ ఉన్నందున తొలగించాల్సిన అవసరం ఉందని కమిషనర్ చెప్పినట్లు సమాచారం. ఇదేకాక తపాలా కార్యాలయానికి ఆనుకుని ఉన్న దుకాణాలను కూడా ఖాళీ చేయాలని అధికారులు నోటీసులు జారీ చేశారు.

ఏటా ఇదే తంతు

ప్రతీ వానాకాలం మున్సిపల్ శాఖ అధికారులు శిథిలభవనాల కూల్చివేతకు నోటీసులు జారీ చేయడం.. అందులో తపాలా శాఖకు తాఖీదు ఇవ్వడం ఆపై వాయిదా పడడం సాధారణమైంది. శిథిలమైన పోస్టాఫీస్ భవనాన్ని గత ఏడాది ఇంజనీరింగ్ విభాగం అధికారులు పరిశీలించగా ఆతర్వాత మరుగున పడింది. మళ్లీ వానాకాలం రావడంతో మున్సిపల్ శాఖ నోటీసులు ఇవ్వగానే పోస్టల్ అధికారులు గడువు అడగడం గమనార్హం. ఇటీవల ఈ భవనానికి సమీపాన ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయం కూలిపోయిన విషయం విదితమే.

రుణమాఫీ నగదు రైతుల ఖాతాల్లో జమచేయాలి



నాగులవంచలో రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న డీఏఓ

చింతకాని: రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ కింద విడుదల చేసిన నగదును నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల సూచించారు. మండలంలోని జగన్నాథపురం, నాగులవంచ రైతు వేదికల్లో బుధవారం ఆమె రైతులు, అధికారులతో సమావేశమై అర్హులైన రైతులందరికీ మాఫీ వస్తుందని తెలిపారు. ఆతర్వాత నాగులవంచలో రుణమాఫీ అమలైన రైతులతో మాట్లాడి అభిప్రాయాలు సేకరించారు. అనంతరం డీసీసీబీ బ్రాంచ్, పీఏసీఎస్‌కు వెళ్లి ప్రభుత్వం నుంచి వచ్చిన నగదును రైతుల ఖాతాల్లో జమ చేయాలని అధికారులకు సూచించారు. ఏఓ పల్లెల నాగయ్య, డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ చైతన్య, సొసైటీ సీఈఓ శ్రీనివాసరావు, ఏఈఓలు హరికృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

జేవీఆర్‌కు అటానమస్ హోదా!



సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సత్తుపల్లిటౌన్: ఏళ్ల చరిత్ర కలిగిన సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా లభించింది. న్యూఢిల్లీలోని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) నుంచి బుధవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. త్వరలోనే గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు జరుపుకోనుండగా అటానమస్ హోదా దక్కడంతో అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 1976లో స్థాపించిన ఈ కళాశాలలో ప్రయోగశాలలు, సుదీర్ఘ అనుభవం ఉన్న అధ్యాపకులు ఉండగా.. ప్లేస్‌మెంట్ డ్రైవ్ ద్వారా విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. పరిశోధన, ఉన్నత విద్యాప్రమాణాలకు గాను గతంలో జాతీయ స్థాయిలో అవార్డులు, న్యాక్ ఏ-గ్రేడ్ లభించింది. ఇప్పుడు అటానమస్ హోదా లభించడంపై ఉన్నత విద్య కమిషనర్ దేవసేన, జాయింట్ డైరెక్టర్లు ప్రొఫెసర్ రాజేంద్రసింగ్, ప్రొఫెసర్ యాదగిరి, ఏజీఓ బాల భాస్కర్, కేయూ వీసీ, రిజిస్ట్రార్‌కు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీహెచ్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం లభించిన అవకాశంతో విద్యార్థులను మరింత ఉత్తమంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అటానమస్ హోదాతో డిప్లొమా, డిగ్రీ, పీజీలో కొత్త కోర్సులు ప్రారంభించే అవకాశం లభిస్తుందని చెప్పారు.

వినియోగదారులపై భారం మోపం..

బీఎస్ఎన్ఎల్ డీజీఎం శ్రీనివాసరావు



జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: ప్రైవేట్ టెలికాం సంస్థల మాదిరి బీఎస్ఎన్ఎల్ చార్జీలు పెంచి వినియోగదారులపై భారం మోపదని సంస్థ ఖమ్మం డీజీఎం దుంపల శ్రీనివాసరావు వెల్లడించారు. సంస్థ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, ఫ్రాంచైజీల ఆధ్వర్యాన బీఎస్ఎన్ఎల్ రీచార్జ్ ధరలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఖమ్మంలో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ నెలకు రూ.199 రీచార్జ్‌తో 2జీబీ డేటా, అన్‌లిమిటెడ్ కాల్స్, రూ.249 రీచార్జ్ చేస్తే 45 రోజుల కాలపరిమితితో రోజుకు 2జీబీ డేటా, అన్‌లిమిటెడ్ కాల్స్ అందుతోందని తెలిపారు. ఈవిషయాన్ని గమనించిన ప్రజలు బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపుతున్నారని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో 2జీ, 3జీ టవర్లు 390 ఉండగా..4జీ సాచురేషన్ టవర్లు 47 ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు నాటికి ఖమ్మం జిల్లాలో 4జీ నెట్‌వర్క్ అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. ఇటీవల ప్రైవేట్ టెలికాం సంస్థలు రీచార్జ్ ధరలు పెంచగా 15 రోజుల వ్యవధిలోనే 10 వేల మందికి పైగా బీఎస్ఎన్ఎల్ వైపు వచ్చారని డీజీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సుష్మా, గోవింద్, రామ్‌కుమార్, సుధీర్, ఎంటీ శ్రీనివాసరావు, ఎస్‌డీఈ కేలోత్ రాంబాబు, యూనియన్ నాయకులు దుర్గారావు, సాంబశివరావు, పున్నారావు, ఎస్‌డీఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మత్స్యశాఖ అధికారిగా రాజనర్సయ్య



రాజనర్సయ్యతో కార్యాలయ ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా మత్స్యశాఖ అధికారిగా జి.రాజనర్సయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జ్‌గా ఉన్న డి.ఆంజనేయ స్వామి నిజామాబాద్‌కు, అక్కడి నుంచి రాజనర్సయ్యను ఖమ్మంకు ఇటీవల బదిలీ అయ్యారు. ఈనేపథ్యాన విధుల్లో చేరిన ఆయన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆతర్వాత రాజనర్సయ్యకు మత్స్యశాఖ కార్యాలయ ఉద్యోగులు యాకూబ్‌అలీ, చాముండేశ్వరి, బెనర్జీబాబు, రామారావు, మల్లయ్య తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టరేట్‌లో పల్లె కళ!



కలెక్టరేట్‌లో బొమ్మలు గీస్తున్న చిత్రకారులు

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్‌కు కొత్త కళ సంతరించుకుంటోంది. ఆవరణలోని గోడలపై పల్లె వాతావరణం ప్రతిబింబించేలా చిత్రాలు వేయించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ నిర్ణయించారు. ఈమేరకు సిద్దిపేటకు చెందిన ఎనిమిది మంది కళాకారులు బుధవారం కలెక్టరేట్‌లోకి ప్రవేశించే ప్రధాన ద్వారం వరండాల్లో చిత్రాలు వేయడం మొదలుపెట్టారు. పల్లె వాతావరణం ఉట్టిపడేలా ఆవులు, గేదెలతో పొలాలకు వెళ్తున్న రైతులు, పూరిగుడిసెలు, చెట్ల కింద జనం, వాకిలి ఊడుస్తున్న మహిళ, ఆవు పాలు పితుకుతున్న రైతుల చిత్రాలను గీస్తున్నారు. ముజమ్మిల్ ఖాన్ పెద్దపల్లిలో కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన సమయాన అక్కడి కలెక్టరేట్‌లో ఇలాంటి చిత్రాలే వేయించగా.. ఖమ్మంలో కూడా వేయిస్తుండడంతో త్వరలోనే కొత్త కళ సంతరించుకోనుంది.

చట్టాల సవరణపై కేంద్ర న్యాయశాఖ మంత్రికి వినతి



కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ వద్దిరాజు, న్యాయవాదులు

ఖమ్మంలీగల్: కొత్తగా అమల్లోకి వచ్చిన చట్టాలను సమీక్షించి అవసరమైన సవరణలు చేయడమే కాక సెంట్రల్ నోటరీల నియామకం చేపట్టాలని, న్యాయవాదుల రక్షణ బిల్లును అమలు చేయాలని కోరుతూ కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌కు న్యాయవాదులు వినతిపత్రం అందజేశారు. ఢిల్లీలో ఎంపీ రవిచంద్ర నేతృత్వాన ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్, న్యాయవాదులు తాళ్లూరి దిలీప్‌చౌదరి, సంక్రాంతి రాజశేఖర్ మంత్రిని బుధవారం ఢిల్లీలో కలిశారు. ఈసందర్భంగా వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు.

గోదావరి తగ్గుముఖం

రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ



కల్యాణకట్ట దిగువ వరకు ఉన్న గోదావరి ప్రవాహం

భద్రాచలం: భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. బుధవారం 48 అడుగుల దిగువకు నీటిమట్టం నమోదు కావడంతో భద్రాచలం ఆర్‌డీఓ దామోదర్‌రావు రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. రాత్రి 10 గంటలకు 45.10 అడుగులతో 10,18,806 క్యూసెక్కుల నీరు ప్రవహించింది. నీటిమట్టం 43 అడుగులకు తగ్గితే మొదటి ప్రమాద హెచ్చరికను సైతం ఉపసంహరిస్తారు. ఇక చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు చెందిన 25 గేట్లు ఎత్తి వరదనీటిని గోదావరిలోకి వదులుతున్నారు. నదీ ప్రవాహం శాంతించినా తగ్గుదల స్వల్పంగా ఉండడంతో ముంపు మండలాల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డీఓ సూచించారు.

క్లుప్తంగా

రేపు ముత్తారం ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం


జీవన్‌బాబు, చైర్మన్

ముదిగొండ: మండలంలోని ముత్తారం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం కొత్త పాలక మండలి ఈనెల 26వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనుంది. పాలక మండలి చైర్మన్‌గా తుల్లూరు జీవన్‌బాబు, సభ్యులుగా కాకి వీరభద్రం, వనం వెంకటేశ్వర రావు, చెన్ను అమ్మయ్య, తాళ్ల చిన ఉపేందర్, ఎస్.సమత, జి.శ్రీనివాసరావును నియమిస్తూ ఇటీవల ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు శుక్రవారం ఉదయం 9గంటలకు జరిగే ప్రమాణ స్వీకారోత్సవానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను ఆహ్వానించినట్టు చైర్మన్ జీవన్‌బాబు తెలిపారు. కాగా, కార్యక్రమానికి హాజరయ్యే ముత్తారం, కోదండరాంపురం, వనం వారి కృష్ణాపురం ప్రజల కోసం ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అలాగే, ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన స్థానికుల సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

జిల్లా జడ్జిని కలిసిన ప్రభుత్వ న్యాయవాది


జిల్లా జడ్జిని సన్మానిస్తున్న రవీంద్ర

ఖమ్మంలీగల్: ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులైన అయితం రవీంద్ర బుధవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవీంద్రను జిల్లా జడ్జి అభినందించగా, జడ్జిని ఆయన సన్మానించారు. కాగా, రవీంద్రకు బార్ అసోసియేషన్ బాధ్యులు చింతనిప్పు వెంకట్, కె.వెంకటేశ్వరరావు, ఈ.శ్రీనివాసరావు, న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

108 సిబ్బందికి రాష్ట్రస్థాయి అవార్డు


అవార్డు అందుకుంటున్న మనోహర్

చింతకాని: ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ద్వారా నిర్వహిస్తున్న 108 అంబులెన్స్ బోనకల్ సిబ్బంది నంద్రు మనోహర్, పైలట్ గోపాలకృష్ణ రాష్ట్ర స్థాయి ప్రతిభా అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో వారికి లైఫ్ సేవియర్ అవార్డులతో పాటు ప్రశంసాపత్రాలను సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యనిర్వాహక అధికారి ఖలీద్ ప్రదానం చేశారు. ఈ ఏడాది మే నెలలో ఓ వివాహిత కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం చేసుకోగా ఆమెను 108 సిబ్బంది ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. ఇందుకుగాను వీరికి అవార్డులు దక్కగా ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్, జిల్లా మేనేజర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఉషా పోటీలకు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: తెలంగాణ ఉషా అసోసియేషన్ ఆధ్వర్యాన జూనియర్స్ విభాగంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ ఎంపిక పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన జి.సాత్విక్, బి.విష్ణువర్ధన్ ప్రతిభ కనబరిచారు. ఈమేరకు వీరు 26వ తేదీ నుంచి తమిళనాడు రాష్ట్రం కోయబత్తురులో జరిగే జాతీయ స్థాయి ఉషా పోటీలకు ఎంపికయ్యారు. క్రీడాకారులను డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఉషా కోచ్ పి.పరిపూర్ణాచారి అభినందించారు.

28న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి అండర్–14, 16, 18, 20 బాలబాలికలతో పాటు పురుషులు, మహిళలకు ఈనెల 28వ తేదీన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో 100, 400 పరుగుతో పాటు జావెలిన్ త్రో అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారిని ఆగస్టు 7వ తేదీన సరూర్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని, క్రీడాకారులు 28న ఉదయం 8గంటలకు వయసు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మిర్చి	16,300	8,500
ఏసీ మిర్చి	19,300	10,000
ఏసీ తాలు	10,000	9,000
పత్తి	7,300	5,500

– ఖమ్మం వ్యవసాయం

డీఎస్సీ సవాల్..!


ఖమ్మంలోని పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు (ఫైల్)

సుదూర ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలు

- ఒకరోజు ముందే వెళ్లక తప్పని పరిస్థితి
- ప్రయాణాలతో అలసిపోతున్న అభ్యర్థులు
- సకాలంలో చేరుకోవడానికి అవస్థలు

ఖమ్మంసహకారనగర్: నెలల తరబడి చదువుకోవడం ఒక ఎత్తయితే.. పరీక్ష రాయడం ఇంకో ఎత్తు అన్న చందంగా డీఎస్సీ అభ్యర్థుల పరిస్థితి తయారైంది. పరీక్షకు అన్ని రకాలుగా సిద్ధమైన అభ్యర్థులు హాల్‌టికెట్లు చూసుకుని నివ్వెరపోక తప్పలేదు. ఉపాధ్యాయుల నియామకాలకు ఈనెల 18వ తేదీన మొదలైన డీఎస్సీ పరీక్షలు వచ్చే నెల 5వ తేదీ వరకు కొనసాగనున్నాయి. అయితే, పలువురు అభ్యర్థులకు ఇతర జిల్లాలు, దూరప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలు కేటాయించడంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

ఆన్‌లైన్ పేరిట..

ఈసారి డీఎస్సీ పరీక్షలో ఎటువంటి అవకతవకలు జరగకుండా పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. దీనికి కంప్యూటర్లు, ఇంటర్‌నెట్ సౌకర్యం కలిగిన ఇంజనీరింగ్ కళాశాలలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ఈనేపథ్యాన జిల్లాలోని ఆరు ఇంజనీరింగ్ కళాశాలల్లో 25వేల మంది అభ్యర్థులు మాత్రమే పరీక్ష రాసే అవకాశముంది. మిగతా వారందరికీ సుదూర ప్రాంతాల్లో సెంటర్లు కేటాయించారు. జిల్లా అభ్యర్థులు పలువురికి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నిజామాబాద్, కరీంనగర్ తదితర జిల్లాల్లో పరీక్ష కేంద్రాలను కేటాయించగా.. ఒక రోజు ముందే వెళ్లాల్సి వస్తోంది. అయితే, ముందు రోజు రాత్రి బయలుదేరి కేంద్రానికి చేరుకుంటుండగా పరీక్ష సమయానికి అలసిపోతున్నామని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క సూర్యాపేట, వరంగల్, భద్రాద్రి తదితర జిల్లాల అభ్యర్థులకు ఖమ్మం జిల్లాలో సెంటర్లు కేటాయించడంతో వారికీ అదే పరిస్థితి ఎదురవుతోంది.

ఆర్థిక భారం తప్పట్లేదు..



నాకు సిద్దిపేటలో కేంద్రం కేటాయించారు. గత సోమవారం ఉదయం జరిగిన పరీక్షకు హాజరయ్యారు. అయితే, ఆదివారం వెళ్తే ఇబ్బంది అవుతుందని శనివారమే వెళ్లి కేంద్రం చూసుకుని సిద్దిపేటలో ఉన్నాను. ఫలితంగా భోజనం,ఇతర ఖర్చులు పెరిగాయి.

– భూలక్ష్మి, కొణిజర్ల

ముందు రోజే బయలుదేరా...



మాది కొణిజర్ల మండలం లాలాపురం. నాకు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కండల కోయ సీఎంఆర్ కళాశాలలో డీఎస్సీ పరీక్ష కేంద్రం కేటాయించారు. పరీక్ష గత ఆదివారం జరగగా, దూరం కావడంతో శనివారం మధ్యాహ్నమే బయలుదేరి వెళ్లాల్సి వచ్చింది.

– అనుమోలు రామారావు, లాలాపురం

నిబంధనలు కఠినం..

డీఎస్సీ పరీక్షలు రోజుకు రెండు విడతల్లో నిర్వహిస్తున్నారు. ఉదయం పరీక్షకు 9 గంటల్లోగా, మధ్యాహ్నం పరీక్షకు 2 గంటల్లోగా కేంద్రం లోపలికి చేరుకోవాల్సి ఉంటుంది. నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యాన దూర ప్రాంతాల అభ్యర్థులు సకాలంలో చేరుకోవడానికి అవస్థ పడుతున్నారు. ఇటీవల వరుసగా వర్షాలు కురుస్తుండడంతో వీరి ఇక్కట్లు మరింత పెరిగాయి. కాగా, ఒకరోజు ముందు సెంటర్ కేటాయించిన పట్టణాలకు వెళ్తే అక్కడ బంధువులు, స్నేహితులు లేక హోటళ్లలో ఉండాల్సి రావడంపై ఆర్థిక భారం పడుతోందని వాపోతున్నారు. అభ్యర్థుల ఆధారంగా సొంత జిల్లా లేదంటే సమీప జిల్లాలో పరీక్ష కేంద్రాలను కేటాయిస్తే భారం తగ్గేదనే భావన వ్యక్తమవుతోంది.

ఈ టీచర్ మాకొద్దు...

ఎంఈఓ ఎదుట తల్లిదండ్రుల ఆందోళన


చిన్నతండాలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ చలపతిరావు

నేలకొండపల్లి: సమయపాలన పాటించకపోగా, కొన్ని సార్లు పాఠశాలకే రాడని, ఆపై విద్యార్థులతో పని చేయిస్తాడంటూ ఉపాధ్యాయుడిపై తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన విద్యార్థులు తల్లిదండ్రులు ఆయనను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని మంగాపురం చిన్నతండా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు సురేష్ తీరుపై స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం ఎంఈఓ చలపతిరావుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావుతో కలిసి గ్రామానికి వచ్చి విచారణ చేపట్టారు. ఉపాధ్యాయుడు సమయానికి రాకపోగా, నిర్ణీత సమయం కంటే ముందే పాఠశాల మూసేస్తున్నాడని స్థానికులు ఆరోపించారు. సదరు ఉపాధ్యాయుడి స్థానంలో ఇంకొకరిని నియమించకపోతే పిల్లలను మరో పాఠశాలకు పంపిస్తామని స్పష్టం చేశారు. దీంతో ఎంఈఓ స్పందిస్తూ ఇకపై మార్పు తీసుకొస్తామని, నెలలోగా తీరు మారకుంటే చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

డీసీసీబీలో 37,625 మందికి రుణమాఫీ

చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లు


బేతంపూడి సొసైటీ వద్ద రైతులతో మాట్లాడుతున్న చైర్మన్ వెంకటేశ్వర్లు

టేకులపల్లి/ఇల్లెందు రూరల్/గుండాల/కామేపల్లి/కారేపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేసిన రుణమాఫీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లు సూచించారు. టేకులపల్లి మండలం బేతంపూడి పీఏసీఎస్, ఇల్లెందు, గుండాలలోని పీఏసీఎస్, డీసీసీబీ బ్రాంచ్‌తో పాటు కామేపల్లి మండలం తాళ్లగూడెం, కారేపల్లిలోని డీసీసీబీ బ్రాంచ్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రుణమాఫీ అయిన రైతులు రెన్యువల్ చేయించుకుని తిరిగి రుణం పొందితే దళారులను ఆశ్రయించాల్సిన అవసరం ఉండదని చెప్పారు. డీసీసీబీ పరిధిలో 37,625 మంది రైతులకు రూ.121,63,40,360 రుణమాఫీ జరుగుతోందని తెలిపారు. రూ.లక్ష లోపు రుణం కలిగిన వారిలో ఇంకొందరికి జమ కావాల్సి ఉందని చెప్పారు. కాగా, ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల నూతన సొసైటీల ఏర్పాటు కేంద్ర ప్రభుత్వం పరిశీలనలో ఉందని చైర్మన్ వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం ఆయన పీఏసీఎస్‌లకు వచ్చిన రైతులతో మాట్లాడి రుణమాఫీ వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ డైరెక్టర్లు మేకల మల్లిబాబు యాదవ్, జనగం కోటేశ్వరరావు, పీఏసీఎస్‌ల చైర్మన్లు లక్కినేని సురేందర్‌రావు, మెట్టెల కృష్ణ, గొగ్గెల రామయ్య, పుచ్చకాయల వీరభద్రం, డీసీసీబీ బ్రాంచ్‌ల మేనేజర్లు విజయ, అరెం లక్ష్మయ్య, నాగరాజు, రామస్వామి, బాల రవికుమార్, సీఈఓలు పాస్నోజు ప్రేమాచారి, హరిప్రసాద్, రాంబాబు, నాగయ్య, బి.హన్మంతరావుతో పాటు చీమల లక్ష్మీనారాయణ, బానోతు ఇస్తారి, కందుల వెంకటేశ్వర్లు, రామ్మూర్తి, యాకూబ్, కాంతారావు, అడ్డగోడ ఐలయ్య, బానోతు హీరాలాల్, పగడాల మంజుల, తలారి చంద్రప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రతీ బుధవారం పాఠశాల భోజనం’

పథకం అమలుపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి


కల్లూరు : విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జెడ్పీ సీఈఓ వినోద్, అధికారులు


కొణిజర్ల : బాలికలతో మాట్లాడుతున్న డీఈఓ శర్మ, డైట్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ

ఖమ్మం సహకారనగర్ / ఏన్కూరు / కల్లూరు / కొణిజర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుపై జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా ‘ప్రతీ బుధవారం పాఠశాల భోజనం’ కార్యక్రమం పేరిట నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మెనూ అమలయ్యేలా చూడడమే కాకుండా నాణ్యమైన సామగ్రి వాడేలా పర్యవేక్షించేందుకు ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఇందులో భాగంగా బుధవారం 25మంది జిల్లా స్థాయి అధికారులు వివిధ పాఠశాలల్లో భోజనం చేశారని, ఈ అంశంపై కలెక్టర్‌కు నివేదిక సమర్పించనున్నట్లు డీఈఓ సోమశేఖర శర్మ తెలిపారు. ఈమేరకు అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఏన్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జెడ్పీ సీఈఓ ఎస్.వినోద్, సోషల్ వెల్ఫేర్ డీడీ కె.సత్యనారాయణ భోజనం చేశారు. అలాగే, డీఈఓ ఈ.సోమశేఖరశర్మ, ఖమ్మం డైట్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ కొణిజర్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో భోజనం చేసి నాణ్యతపై ఆరా తీశారు. వంటషెడ్లలో శుభ్రత పాటించాలని, వర్షాకాలం ఆకు కూరలు, మిరపకాయలను వాడొద్దని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ సీహెచ్.శేషగిరిరావు, ఎంపీడీఓ కె.చంద్రశేఖర్, ఎంపీఓ సురేష్, హెచ్‌ఎంలు కూరకుల సైదయ్య, పత్తిపాటి నివేదిత, అబ్రహం, శాంతికుమారితో పాటు ఉపాధ్యాయులు, వివిధ శాఖల ఉద్యోగులు నవీన్‌కుమార్, రాధాకృష్ణ, శ్రీధర్, కస్తూరి, పుల్లయ్య, వర్జీనియా, రాంబాబు, సులోచన, కృష్ణవేణి, వీరయ్య హతీరాం, ఇక్బాల్, ప్రసాద్, ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూతగాదాలో ఇరువర్గాలపై కేసు

ఖమ్మంరూరల్: మండలంలోని మంగళగూడెంలో భూతగాదా విషయమై ఘర్షణ పడిన ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం రూరల్ పోలీసులు తెలిపారు. భూమి విషయమై జరిగిన గొడవలో గ్రామానికి చెందిన కొప్పుల నాగేశ్వరరావు, రమేష్, నగేష్, తేజావత్ రవి, మదన్‌లు కొప్పుల రామారావు, జగన్‌పై దాడి చేశారు. మరోపక్క తమ భూమిలో సాగుచేసిన పంటను రామారావు, జగన్ ధ్వంసం చేశారని నాగేశ్వరరావు తదితరులు ఫిర్యాదు చేయడంతో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

కూలీల ఆటో బోల్తా

కూసుమంచి: వరి నాట్లు వేసేన వెళ్తున్న కూలీల ఆటో బోల్తా పడడంతో పలువురికి గాయాలయ్యాయి. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రాంచంద్రాపురానికి గ్రామానికి చెందిన మహిళా కూలీలు కూసుమంచి మండలం పాలేరులో నాట్లు వేసేందుకు బుధవారం వచ్చారు. సాయంత్రం తిరిగి ఆటోలో గ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించే క్రమంలో ఆటోడ్రైవర్ బ్రేక్ వేయడంతో బోల్తా కొట్టింది. ఈఘటనలో 12 మంది కూలీలు గాయపడగా స్థానికులు 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఇద్దరికి కాళ్లు, చేతులు విరిగి తీవ్ర గాయాలైనట్లు తెలిసింది.

హైవే సర్వేను అడ్డుకున్న రైతులు

ఖమ్మంరూరల్: నాగ్‌పూర్– అమరావతి జాతీయ రహదారి సర్వేను మండలంలోని తీర్థాల, కామంచికల్ గ్రామాల రైతులు బుధవారం అడ్డుకున్నారు. హైవే నిర్మాణానికి గాను సేకరించనున్న భూముల్లో ఉన్న మొక్కలు, బావులు, పైప్‌లైన్లను సర్వే చేయడానికి అధికారులు చేరుకున్నారు. ఈ సందర్భంగా రైతులు వారిని అడ్డుకుని విలువైన వ్యవసాయ భూములకు సంబంధించి నష్టపరిహారం తేల్చకుండా సర్వే చేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో వ్యవసాయ భూములు ఎకరాకు రూ.30లక్షల నుండి రూ.40 లక్షల వరకు ధర పలుకుతోందని తెలిపారు. నామమాత్రంగా పరిహారం చెల్లిస్తే వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న తాము నష్టపోతామని చెప్పారు. పరిహారంపై సరైన ప్రకటన చేశాకే సర్వే నిర్వహించాలని స్పష్టం చేయడంతో అధికారులు వెనుతిరిగారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రైతులు రెవెన్యూ అధికారులకు అందజేశారు.

ఖజానా శాఖలో 18మంది బదిలీ

ఖమ్మం సహకారనగర్: జిల్లా ఖజానా శాఖలో మొత్తం 18మంది ఉద్యోగులకు బదిలీ జరిగింది. జిల్లా, జోనల్ స్థాయిలో జరిగిన ఈ బదిలీల్లో జిల్లాకు కేటాయించిన ఉద్యోగులు బుధవారం విధుల్లో చేరారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన అధికారులు, ఉద్యోగులు ఖజానా శాఖ డీడీ వెంటపల్లి సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఐసీడీఎస్ ఉద్యోగులకు...

ఖమ్మంవన్‌టౌన్: జిల్లాలోని ఐసీడీఎస్ ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు అందాయి. సాధారణ బదిలీల్లో భాగంగా గత శుక్రవారం వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన విషయం విదితమే. ఈసందర్భంగా నలుగురు యూడీసీలు, 18 మంది గ్రేడ్ –1, 9మంది గ్రేడ్–2 సూపర్‌వైజర్లకు ఉత్తర్వులు జారీచేయగా పలువురు కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించారు.

పశు వైద్యశాఖలో...

ఖమ్మంవ్యవసాయం: పశుసంవర్ధక, పశువైద్య శాఖ ఉద్యోగులకు బుధవారం సాయంత్రం బదిలీ ఉత్తర్వులు అందాయి. ఈనెల 20న కౌన్సెలింగ్ నిర్వహించగా జిల్లాలో ఎనిమిది మంది చొప్పున పశు వైద్య సహాయసంచాకులు, పశువైద్య అధికారులకు బదిలీ జరిగింది.

ఏఎస్సైలుగా పదోన్నతి

ఖమ్మంక్రైం: ఉమ్మడి జిల్లాలో పలువురు హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్సైలుగా పదోన్నతి లభించింది. ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న పి.నారాయణరెడ్డి(1055), శైలజ(2247), టి,బాలస్వామి(608), భన్సీలాల్(2015) ఈ జాబితాలో ఉన్నారు. వీరిని తిరిగి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకే కేటాయించారు.

హైవేపై డివైడర్‌ను ఢీకొట్టిన అంబులెన్స్


ఘటనాస్థలిలో అంబులెన్స్

కూసుమంచి: ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై కూసుమంచి మండలం గంగబండ తండా వద్ద బుధవారం ప్రభుత్వ అంబులెన్స్(పార్థీవ వాహనం) అదుపుతప్పి అండర్ పాస్ ఓపెన్ డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఖమ్మం నుండి సూర్యాపేట వైపు వెళ్తున్న వాహనం ప్రమాదానికి గురికాగా, డ్రైవర్‌కు తీవ్ర గాయాలై క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. దీంతో స్థానికులు ఆయనను బయటకు తీసి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కాగా, అంబులెన్స్ ఢీకొట్టిన డివైడర్ బలంగా ఉండడంతో వాహనం నిలిచిపోయిందని, లేకపోతే 40 అడుగుల ఎత్తు నుండి అండర్‌పాస్ రహదారిపై పడితే పెనుప్రమాదం జరిగేదని స్థానికులు తెలిపారు.

పాము కరిచిందని హైరానా

- ఇద్దరి ప్రాణం తీసిన రోడ్డు ప్రమాదం
- ఆస్పత్రికి వెళ్లే క్రమంలో బైక్ అదుపు తప్పడంతో ఘటన
- పాముకాటు బాధితుడితో పాటు ఇంకో వ్యక్తి మృతి


జాటోతు సైదులు (ఫైల్)

కారేపల్లి: ఓ పక్క పాము కరిచిందనే ఆందోళన.. త్వరగా ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేసుకోవాలనే కంగారులో ద్విచక్రవాహనంపై వేగంగా వెళ్తుండగా అదుపు తప్పడంతో పాము కరిచిన వ్యక్తి, వాహనంపై ఉన్న ఇంకొంకరు తీవ్రగాయాలతో మృతి చెందారు. కారేపల్లి మండలం మేకలతండా గ్రామంలో బుధవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మేకలతండా గ్రామానికి చెందిన జాటోతు సైదులు(32) మినీ డెయిరీ ఫామ్ నిర్వహిస్తుండగా అందులో పనిచేసేందుకు మహారాష్ట్ర నుంచి ఇద్దరు కూలీలు వచ్చారు. వీరు బుధవారం షెడ్డులో పనిచేస్తుండగా సైదులు కాలిపై పాము కరిచింది. దీంతో మహారాష్ట్రకు చెందిన కూలీని తీసుకుని బైక్ సైదులే నడుపుతూ కారేపల్లి ఆస్పత్రికి బయలుదేరారు. పాము కరిచిన నేపథ్యాన త్వరగా చికిత్స చేయించుకోవాలనే భావనతో సైదులు వేగంగా నడుపుతుండగా మార్గమధ్యలో తల తిరగడంతో బైక్ అదుపుతప్పి కల్వర్టుకు ఢీకొట్టి పక్కనే ఉన్న పొలంలో పడిపోయింది. అక్కడ రాళ్లు ఉండడంతో వీరిద్దరి తలకు తీవ్రగాయాలు కాగా అపస్మారకస్థితికి చేరారు. ఆ మార్గంలో వెళ్తున్న రైతులు ఆలస్యంగా వీరిని గుర్తించి ఆటోలో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే సైదులు, ఆయనతో పాటు ఉన్న కూలీ మృతి చెందారు. సైదులుకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉండగా, ఉపాధి కోసం వచ్చిన మహారాష్ట్ర కూలీ మృత్యువాత పడడం విషాదాన్ని నింపింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కుక్క అడ్డు రావడంతో ఘటన


తాటి శ్రీనివాసరావు (ఫైల్)

దమ్మపేట/పెనుబల్లి: రహదారిపై ఆకస్మాత్తుగా కుక్క అడ్డురావడంతో కింద పడిన ద్విచక్ర వాహనదారుడు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన దమ్మపేట మండలం గణేష్‌పాడు క్రాస్ రోడ్డు సమీపాన బుధవారం చోటుచేసుకుంది. పెనుబల్లి మండలం యేరుగట్ల రామచంద్రాపురం గ్రామానికి చెందిన తాటి శ్రీనివాసరావు (40) ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం కమ్మరిగూడెంలోని పుట్టింట్లో ఉన్న భార్య వద్దకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. దమ్మపేట మండలం గణేష్‌పాడు క్రాస్ వద్దకు చేరుకోగా ఆకస్మాత్తుగా ఓ కుక్క ఎదురుగా పరిగెత్తుకుంటూ వచ్చి ఆయన బైక్‌ను తాకింది. దీంతో శ్రీనివాసరావు కింద పడగా తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 సిబ్బంది చేరుకుని మృతి చెందినట్లుగా నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

గురుకులాల్లో ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్

పాల్వంచ: ఉమ్మడి జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల్లో ప్రవేశాల కోసం ఈనెల 26, 27వ తేదీల్లో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం జనరల్ గ్రూప్‌లతో పాటు ఒకేషనల్ గ్రూప్‌ల్లో మిగిలిన సీట్ల భర్తీకి కోసం ప్రభుత్వం అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. బాలికలకు 26వ తేదీన టేకులపల్లి గురుకులంలో, బాలురకు 27వ తేదీన తిరుమలయపాలెంలో కౌన్సెలింగ్ ఉంటుందని, విద్యార్థులు పదో తరగతి మెమో, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం ధ్రువపత్రాలతో హాజరుకావాలని అధికారులు సూచించారు.

చిట్‌ఫండ్ కార్యాలయం ఎదుట ఆందోళన

ఖమ్మంక్రైం: ఖమ్మం కొత్త బస్టాండ్ సమీపాన ఓ చిట్ ఫండ్ సంస్థనిర్వాహకులు చీటీ పాడిన నెలల తర్వాత కూడా డబ్బు చెల్లించడం లేదని ఆరోపిస్తూ పలువురు బుధవారం కార్యాలయం ఎదుట ఆందోళన దిగారు. డబ్బులు ఇవ్వకపోవడమే కాక ఇదేమిటని అడిగితే దాడి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇంట్లో చోరీకి మహిళల యత్నం

తరిమికొట్టిన వృద్ధురాలు!

నేలకొండపల్లి: సినీ ఫక్కీలో ఇద్దరు మహిళలు ఓ ఇంట్లో చోరీకి యత్నించగా.. ఒంటరిగా ఉన్న వృద్ధురాలు ధైర్యంగా తరిమికొట్టిన వైనమిది. మండలంలోని మోటాపురానికి చెందిన వృద్ధురాలు రావెళ్ల దమయంతి ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఆమె బుధవారం టీవీ చూస్తుండగా ఇద్దరు మహిళలు చేరుకుని ఒకరు నేరుగా లోపలికి వెళ్లి తెలిసిన వారి మాదిరిగా దమయంతిని పలకరించింది. దీంతో ఆమె ఎవరని ప్రశ్నిస్తుండగా టీవీ చూద్దామని వచ్చానని చెప్పి ఆ మహిళ తలుపు గడియ పెట్టి చోరీకి యత్నించింది. ఈమేరకు దమయంతి తేరుకుని కర్ర తీసుకుని కొడుతుండడంతో తట్టుకోలేక బయటకు పరుగులు తీసిన ఆగంతకురాలు అక్కడ ఉన్న మరో మహిళతో కలిసి రోడ్డుపైకి ఎక్కగానే అప్పటికే వచ్చిన ఓ వ్యక్తి వచ్చి బైక్‌పై ఎక్కించుకుని పరారయ్యారు. ఈవిషయమై దమయంతి పోలీసులకు ఫిర్యాదు చేయగా, దుండగులను ధైర్యంగా ఎదిరించిన ఆమెను స్థానికులు అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు, ఆయిల్ చోరీ

తల్లాడ: మండలంలోని నారాయణపురంలో బుధవారం తెల్లవారుజామున ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైరు, ఆయిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. గ్రామంలోని రైతు రెడ్డెం శ్రీనివాసరెడ్డి పొలంలో ఉన్న 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దుండగులు రూ.30వేలకు పైగా విలువైన వైర్, ఆయిల్ ఎత్తుకెళ్లారు. ఘటనపై విద్యుత్ ఏఈ రాజేష్ తల్లాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు ఎక్కబోతూ కిందపడి యువకుడి మృతి

పాల్వంచ : రైలు ఎక్కబోతూ జారి కిందపడి పాల్వంచకు చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లో మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. పాల్వంచ జ్యోతినగర్‌కు చెందిన ఆరిఫ్ బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. బుధవారం రాత్రి పాల్వంచకు వచ్చేందుకు మౌలాలీ స్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడ కాకతీయ ఎక్స్‌ప్రెస్ రైలు అనుకుని వేరేది ఎక్కాడు. ఇంతలోనే అది కాదని తెలుసుకుని దిగిరాగా, అప్పటికే కాకతీయ రైలు కదులుతోంది. పరుగున వచ్చి రైలు ఎక్కబోతుండగా జారి కిందపడి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ఆరిఫ్ తల్లిదండ్రులు గతంలోనే మృతిచెందగా మరో సోదరుడు ఉన్నాడు.